# ఆకోరులోయ అనుభవాలకు గల ప్రధాన కారణాలు

## ఆకోరు లోయ అనగా?

• బాధ లోయ (యెహోషువ 7: 26) • శ్రమగల లోయ (హోషేయా 2:15)

పర్వతాలు “దేవుని గురించి” మాట్లాడే అనుభవాలయితే, లోయలు “దేవునితో" మాట్లాడే అనుభవాలు.

ఇశ్రాయేలీయులను, దేవుడు 430 సంవత్సరముల ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించి, మోషేగారి నాయకత్వములో వాగ్దానభూమికి నడిపిస్తున్న సందర్భములో, మోషే మరణించిన తరువాత, ఆసారధ్య బాధ్యతలను యెహోషువాకు దేవుడు అప్పగించారు. నాయకుడైన యెహోషువా యెరికో పట్టణం పట్టుకొనకముందే ఇశ్రాయేలీయులకు స్పష్టమైన హెచ్చరికి చేసాడు. ఈ పట్టణ మును దీనిలో నున్న ది యావత్తును యెహోవా వలన శపింప బడెను.... శపింపబడినదానిలో కొంచెమైనను మీరు తీసికొనిన యెడల మీరు శాపగ్రస్తులై ఇశ్రాయేలీయుల పాళెమునకు శాపము తెప్పించి దానికి బాధ కలుగజేయుదురు గనుక శపింపబడిన దానిని మీరు ముట్టకూడదు .... ఆ కాలమున యెహోషువ జనులచేత శపథము చేయించి వారికీలాగు ఆజ్ఞాపించెనుఎవడు యెరికో పట్టణమును కట్టించపూనుకొనునో వాడు యెహోవా దృష్టికి శాపగ్రస్తుడగును; వాడు దాని పునాది వేయగా వాని జ్యేష్ఠకుమారుడు చచ్చును; దాని తలుపులను నిలువనెత్తగా వాని కనిష్ఠకుమారుడు చచ్చును; యెహోషువ 6: 17,18,26

అయితే, ఆకాను దేవుని సేవకుడైన యెహోషువాగారి మాటలను పెడచెవిని పెట్టి, తనను స్వంత చిత్తాన్ని నెరవేర్చాడు. దాని ఫలితమేమిటంటే? యెహోషువయు ఇశ్రాయేలీయులందరును జెరహు కుమారుడైన ఆకానును ఆవెండిని ఆ పైవస్త్రమును ఆ బంగారు కమ్మిని, ఆకాను కుమారులను కుమార్తెలను ఎద్దులను గాడిదలను మందను డేరాను వానికి కలిగిన సమస్తమును పట్టుకొని ఆకోరు లోయలోనికి తీసికొనివచ్చిరి. అప్పుడు యెహోషువనీవేల మమ్మును బాధ పరిచితివి? నేడు యెహోవా నిన్ను బాధపరచుననగా ఇశ్రాయేలీయులందరు వానిని రాళ్లతో చావగొట్టిరి; వారిని రాళ్లతో కొట్టిన తరువాత అగ్నిచేత కాల్చి వారిమీద రాళ్లను పెద్ద కుప్పగా వేసిరి. అది నేటివరకు ఉన్నది. అప్పుడు యెహోవా కోపోద్రేకము విడనవాడై మళ్లుకొనెను. అందుచేతను నేటివరకు ఆ చోటికి ఆకోరు లోయ అనిపేరు. (యెహోషువ 7:24-26), ఆకోరులోయ అనుభవాలకు గల ప్రధాన కారణాలు.

## 1. దేవుని సేవకుడైన యెహోషువా మాటను ఆకాను లక్ష్యపెట్టలేదు

దేవుని సేవకుని మాటను పెడచెవిని పెట్టడం ద్వారా, ఆకాను దేవుని మాటను పెడచెవిని పెట్టినవాడయ్యాడు. ఆకోరు అనుభవాలకు యిదే ప్రధాన కారణమయ్యింది. నేటి దినాన్న మన బాధలకు, శ్రమలకు కూడా ప్రధాన కారణం యిదే. సంవత్సరాల తరబడి దేవుని మాటలు వింటున్నా, వాటిని పెడచెవిని పెట్టి, మన చిత్తాన్ని నెరవేర్చుకునేజీవితం.

Source: Pas Abhisheck

## 2. దోపుడు సొమ్మును “చూచాడు”

చూడడం లో తప్పులేదుగాని, ఆ చూపుల్లో పరిశుద్ధతను కోల్పోకూడదు. కానీ, అదే జరిగింది మోహపు చూపు (మత్తయి 5:28) ఓర చూపు ( యెషయా 3:16) విషపు చూపు (1 సమూ 18:9) వెనుక చూపు ( ఆది 19:26) ఈ చూపులన్నీకూడా అత్యంత ప్రమాదకరమైనవే. ఇవన్నీ ఆకోరులోయకు నడిపించేవే. మన చూపులలో పరిశుద్ధతనుకోల్పోయివుంటే, యోబుగారి వలే కన్నులతో నిబంధన చెయ్యాలి (యోబు 31:1) వ్యర్థమైన వాటిని చూడకుండా నా కన్నులను త్రిప్పివేయమని దావీదుగారివలే దేవునిని ప్రార్ధించాలి. ( కీర్తనలు119:37)

## 3. దోపుడు సొమ్మును “ఆశించాడు”

ఆశను కలిగియుండడంలో తప్పులేదు గాని, ఆ ఆశలో అత్యాశకు, దురాశకు తావుండకూడదు. పరిశుద్ధత కోల్పోకూడదు. కానీ, అదే జరిగింది. ఆకాను చూచిన దానిని ఆశించాడు.

చిన్న కుమారుడు వయస్సుకు మించిన ఆశను కలిగియున్నాడు. (లూకా 15:12) అమ్నోను వావివరుసలు లేని ఆశను కలిగియున్నాడు (2 సమూ 13:1) వీటి ప్రతిఫలాలు ఏమిటో మనకు స్పష్టంగా తెలుసు. ఆశ దురాశగా మారితే? దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును. (యాకోబు 1:15) ఇవన్నీ ఆకోరులోయకు నడిపించేవే. అయితే, యబ్బేజు కలిగియున్న ఆశను (1 దిన 4:10), కోరహు కుమారులు కలిగియున్న ఆశను (కీర్తనలు42:1,2; 84: 1, 2) దావీదు కలిగియున్న ఆశను (కీర్తనలు 61: 1,2) మనమునూ కలిగియుండవలెను.

## 4. దోపుడు సొమ్మును “తీసుకున్నాడు"

ఆకాను చూచిన దానిని ఆశించాడు. ఆశించినదానినిఆక్రమించాడు (తీసుకున్నాడు).తనదికాని దాని నాక్ర మించి యభివృద్ధినొందినవానికి శ్రమ. (హబక్కూకు 2:6) నాయకుడైన యెహోషువ ముందుగానే హెచ్చరించాడు. అది శపితమైన పట్టణమని, దానిలోని వస్తువులు దేవునికి మాత్రమే చెందుతాయని. అయితే, దేవునికి చెందాల్సిన వాటిని ఆకాను తీసుకున్నాడు. అదే ఆకోరులోయ అనుభవానికి కారణమయ్యింది. మన జీవితాల్లో కూడా ఆకోరులోయ అనుభవాలకు ఇదే కారణమేమో? మనవి కాని వాటికోసం ప్రాకులాడి, బాధలను కొనితెచ్చుకొంటున్నామేమో?

Source: Pas Abhisheck

## 5. దోపుడు సొమ్మును "దాచుకున్నాడు"

ఆకాను చూచిన దానిని ఆశించాడు. ఆశించినదానిని ఆక్రమించాడు (తీసుకున్నాడు). తీసుకున్న దానిని దాచుకున్నాడు. మనుష్యులకు దాయడం సాధ్యమౌతుందేమో గాని, సర్వ వ్యాపి, సర్వజ్ఞుడును నైనా దేవునికి తెలియకుండా దాయడం సాధ్యమవుతుందా?

ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. (హెబ్రీ 4:13) నీవెక్కడికెళ్లిననూ ఆయన అక్కడనున్నాడు. (కీర్తనలు 139: 2,8,9). ఆకాను దేవునికి తెలియదనుకున్నాడేమో? కాని, అతని పాపమే అతనిని పట్టుకొంది. మీ పాపము మిమ్మును పట్టుకొనును (సంఖ్యా 32:23). అదే ఆకోరులోయ అనుభవానికి కారణమయ్యింది. మన జీవితాల్లో మనము అనుభవిస్తున్న బాధలకు, శ్రమలకు కారణం? దేవునికి దూరంగా దాగే ప్రయత్నం చెయ్యడమే.

## 6. తప్పును ఒప్పుకోవడానికి "కాలయాపన చేసాడు"

యెరికో మీద అద్భుతమైన విజయం సాధించిన ఇశ్రాయేలీయులు చిన్న పట్టణమైన హాయి మీదఓటమిపాలయ్యారు. దానికి గల కారణాన్ని దేవుడు తెలియజేసారు.యెహోషువ ఉదయమున లేచి ఇశ్రాయేలీ యులను వారి గోత్రముల వరుసనుబట్టి దగ్గరకు రప్పించి నప్పుడు యూదాగోత్రము పట్టుబడెను. యూదా గోత్రము పట్టబడినా, మా వంశము పట్టబడదులే అనుకున్నాడు. అయితే, అతని వంశము "జెరహీయుల వంశము" పట్టబడింది. తన కుటుంబము పట్టబడదులే అనుకున్నాడు. అతని తాతయ్య “జబ్ది" పట్టబడ్డాడు. చివరికి కర్మీ కుమారుడైన ఆకాను పట్టబడ్డాడు. చివరి క్షణంలోనైనా తప్పించుకుంటాననే ఆలోచనతో కాలయాపన చేసాడు. అదే ఆకోరులోయ అనుభవానికి కారణమయ్యింది. మన జీవితాల్లో మనము అనుభవిస్తున్న బాధలకు, శ్రమలకు కారణం? మన పాపాన్ని ఒప్పుకోకుండా, కప్పుకొనే ప్రయత్నం చెయ్యడం వలననే కాబోలు. మన జీవితాలను మనకు మనమే పరిశీలన చేసుకొని, సరిచేసుకునే ప్రయత్నం చేయగలగాలి.అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును. (సామెతలు 28:13)

`

## 7. గత్యంతరం లేక “ఒప్పుకున్నాడు”

ఆకాను ఒప్పుకున్నప్పటికినీ క్షమించబడలేకపోయాడు. దానికి రెండుకారణాలు చెప్పుకోవచ్చు.

- అది పశ్చాత్తాపముతో కూడిన ఒప్పుకోలుకాదు. గత్యంతరం లేక, పట్టుబడ్డాడు కాబట్టి, తాను చేసినదంతయూ ఒప్పుకున్నాడు. సమయం మించిపోయాక ఒప్పుకున్నా క్షమించబడడం సాధ్యంకాదు

- శపింపబడినదానిలో కొంచెమైనను మీరు తీసికొనిన యెడల మీరు శాపగ్రస్తులవుతారు (యెహోషువ 6:18) ఈ విషయాన్ని ముందుగానే యెహోషువా తెలియజేసారు. అంటే, ఇప్పుడు ఆకాను శాపగ్రస్తుడయ్యాడు. పాపికి క్షమించబడే అవకాశం వుంది గాని, శాపగ్రస్తునికి క్షమాపణ లేదు. శపింప బడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతల కును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి. (మత్తయి 25:41)

## 8. ఆకాను చేసిన తప్పుకు తన కుటుంబమంతటికీ శిక్ష:

ఆకాను చేసిన అపరాధం వారి కుటుంబమంతటికీ తెలిసియుండి కూడా ఒకవేళ వారు మిన్నకుండిపోయారేమో? ఏది ఏమైనా ఆకాను చేసిన పాపము తన కుటుంబమంతటిని బాధించింది. గెహాజి చేసిన పాపం, తన సంతానమంతటికి బాధను కలిగించింది. (2 రాజులు 5:27) మన పాపములు మన కుటుంబాలను బాధించేవిగా వుండకూడదు అంటే, పాపమునకు మనము దూరముగా వుండాలంతే.

## ఆకోరును గూర్చిన వాగ్దానములు

ఆకోరు లోయ పశువులు పరుండు స్థలముగా ఉండును. (యెషయా 65:10) ఆకోరు (శ్రమగల) లోయను నిరీక్షణద్వారముగా చేసెదను (హోషేయా 2:15)

ప్రియ విశ్వాసి! ఆకోరు అనుభవాలలో, బాధలలో, సమాధానం లేకుండా సాగిపోతుందా జీవితం? ఆకోరులో వుండి, నీవు ప్రార్థించగలిగితే నీ ప్రార్థన ప్రభువు వింటాడు. ఆయనను ఆశ్రయించగలిగితే, ఆయన నీకు ఆశ్రయమవుతాడు. "ఎవనిమనస్సు నీమీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగలవానిగా కాపాడుదువు." (యెషయా 26:3). ఆకోరు అనుభవాలు నిరీక్షణ ద్వారముగా మారబోతున్నాయి. శ్రమల నుండి సమాధానము వైపు సాగిపోదాం! అట్టి కృప, ధన్యత దేవుడు మనకు అనుగ్రహించునుగాక! ఆమెన్! ఆమెన్! ఆమెన్!